నిమిత్తమై ఏ విధమైన ఖర్చు, శ్రమపడ నక్కర్లేదు. వాటిని మీ హోటల్లో వుండనిస్తే, బల్లలకింద దూరి వాటి బ్రతుకుదెరువు అవే చూసుకుంటాయి-

'నేను చేయలేని పాపాన్ని మీరు చేయరనీ, నేను చేయలేని పుణ్యాన్ని మీరు చేస్తారనీ భావిస్తూ శెలవు తీసుకుంటున్నా.'

---

# సెక్సు విషయాలు

పాశ్చాత్య దేశాల్లో - ముఖ్యంగా ఇంగ్లండు, అమెరికాలలో - పురుషులకంటే స్త్రీలు జాస్తీగా ఉండటం జగద్విదితం. కాగా, అక్కడ సాధారణంగా నలుగురైదుగురు పేరంటాళ్లు ఒకే అభాగ్యుడి మెడకు చుట్టబెట్టుకుని పెళ్ళిమిషతో వాడి ప్రాణాలను తీస్తారు. ఇంతేకాక ఏ దేశపు పురుషులు ఆ దేశపు స్త్రీలకు చాలక అమెరికా స్త్రీలు ఇంగ్లండు వెళ్ళి, ఇంగ్లీషు స్త్రీలు అమెరికావెళ్ళి పెళ్ళి ప్రయత్నాలు చేసుకుంటూ వుంటారు.

* * *

జర్మనీలో, స్త్రీ పురుషుల సంఖ్య ఎట్లావున్నా అక్కడ ఎవరు ఎవర్ని ప్రేమించ వలసిందీ, పెళ్ళాడ వలసిందీ హిట్లరే నిశ్చయిస్తాడు. ఎవరూ ఎవర్నీ పెళ్ళాడ్డానికి వీల్లేకపోతే అటువంటివారికి పెద్దపెళ్ళి కాన్సన్ట్రేషన్ క్యాంపు - తప్పితే యుద్ధరంగం. కాగా, జర్మనీలో స్త్రీ పురుషుల సంఖ్య ఎట్లావున్నా హిట్లర్ ప్రభుత్వం చల్లగావున్నన్నాళ్ళు అక్కడ Sex కు, వివాహసంస్థకు సంబంధించిన ఏ జిజ్ఞాసలూ, మీమాంసలూ, ధర్మసందేహాలు ఏర్పడవు.

* * *

ఫ్రాన్సులో ప్యారిసు పట్టణమూ, మాంటీకార్లో, ఇతర పేరుపడిన విహారస్థలాలూ, హోటళ్ళూ, డ్యాన్సుహాలులూ మొదలైనవన్నీ

ఈ యుద్ధానికి పూర్వం ఉండే సాంఘిక వాతావరణాన్నీ, అంతర్జాతీయ సహాయాన్నీ, సభ్యతనూ ఇంకా నిలుపుకోగలిగితే అక్కడ స్త్రీ పురుషులు ఎంతమంది ఉన్నదీ లెక్కపెట్టనక్కరలేదు. ఎంతమంది వున్నా, ఎంతమంది లేకపోయినా ఏమడత పేచీలు లేకుండా సర్దుకుపోగలిగే సఖ్యతాభావం, సభ్యతాభావంకూడా అక్కడ వారిలో ఉన్నాయి. దానికి కారణం ముఖ్యంగా ఫ్రాన్సులోని Sex విషయాల్లో ఎక్కువగా Interest తీసుకునేది ఫ్రాన్సువారు కాదు గనకనూ అమెరికన్ టూరిస్టులూ, ఇతర అంతర్జాతీయులూ గనకనూ. ఒక సీజనులో వచ్చి ఒక సీజనులో పోయేవారికి అక్కడ ఎంతమంది స్త్రీలకు ఎంతమంది పురుషులున్నారో లెక్కలు తీసి జమాబందీ చేసే అవసరం దేనికి?

* * *

ఇంక రష్యాలో అసలు స్త్రీ పురుష భేదమే చచ్చిందని చెబుతారు. అక్కడున్నవారు స్త్రీ పురుషులు కారు - కామ్రేడ్సు. అలాంటప్పుడు మనం వారిలో భేదాలెత్తి చూపించి చీలికవిధానం తేబోవడం మనకు పాపం!

* * *

ఇంక ఈజిప్టు, అరేబియా మొదలైన ప్రాంతాలలో నవాబు దర్జా ఇంకా సాగుతూంది. ఇక్కడ పురుషులకంటే స్త్రీలే ఎక్కువమంది ఉంటున్నారు పూర్వంనుంచీ కూడా. అందుచేతనే ఈ ప్రాంతాల్లో పాదుషా లగాయితు ఫకీరువరకూ ప్రతివాడికీ ఒక అంతఃపురం, అందులో కొంతమంది జనానా స్త్రీలూ వుంటూంటారు. టర్కీ ఈ దేశాలకంటే బాగా నాగరికతలోకి వచ్చిందనీ అక్కడి Sex పద్ధతులూ వైవాహిక విధానాలు ఇంతకంటే ఆదర్శంగా వుంటాయని ఇటీవల మనకు తెలుస్తూవుంది.

* * *

అన్నిటికన్నా ఆదర్శప్రాయంగా వుండేపద్ధతి ఆఫ్రికాలోని నీగ్రోలది. వారిని చూసి ఇతరులు వైవాహిక పద్ధతులను మార్చుకుంటే నాగరికతలో వున్న నిస్తేజమైన చాలా జాతులు తేజోవంతంగా తయారవుతాయి. నీగ్రోలలో స్త్రీలు ఎక్కువా పురుషులెక్కువా అనే విషయం మనకు అవసరంలేదు - వారికీ అంతకన్నా అవసరంలేదు. వారిలో ఒక స్త్రీకీ ఒక పురుషుడికీ పెళ్ళిలాంటిది జరగాలంటే కొన్ని Acid Tests వున్నాయి. ఉదాహరణకు ఒకటి చూద్దాం: ఒక నీగ్రో యువకుడు తను ప్రేమించిన చిన్నదాన్ని పొందాలంటే అతడికి ముఖ్యంగా ఉండవలసింది ఆస్తికాదు, సాంప్రదాయంకాదు, చదువు కాదు, తాలూకా గుమాస్తాగిరీ కాదు - నూరేళ్ళు రాయిలా బ్రతికి వుండగలిగి సంసారసౌఖ్యాన్ని అనుభవించగలిగే శక్తి. దానికి నిదర్శనం చూపాలి - ఒక సింహంతో పోరాడి, ఇతరుల సాయంలేకుండా దాన్ని సంహరించగలగాలి. పెళ్ళికొడుక్కి ఉండవలసిన అర్హత యిది. అప్పుడే అతడ్ని ఏ స్త్రీయైనా పెళ్ళాడుతుంది.

* * *

ఇంక మన భారతదేశంలో - మళయాళంలో పురుషులకంటే స్త్రీలు జాస్తీ అనీ అందుకనే దాన్ని ఆడమళయాళం అంటారనీ మనకు తెలుసును. ఇక్కడ ఆడవాళ్లు మొగవాళ్ళని తరిమి పట్టుకుని, పారిపోకుండా గదులలో దాచిపెట్టుకుంటారట! ఈ మొగవాళ్ళని తరిమిపట్టుకునేపద్ధతి మళయాళదేశంలో ఒకానొకప్పుడు ఒక మహోత్కృష్టమైన కళగా భావింపబడేదట. ఇప్పటికికూడా మళయాళంలో, పుట్టిన ప్రతి ఆడపిల్లకీ ఉగ్గుపాలతోనే మొగవాడ్ని ఆకర్షించి, వలలో వేసుకునే సాధనాలన్నీ బోధిస్తారట తల్లులు.

* * *

ఇక పంజాబు, సరిహద్దు రాష్ట్రాలలో ఆడపురుగు బహు తక్కువగా వుంటుందట. కాగా, అక్కడ - ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలలో దారికాని ఆడవాళ్ళను ఎత్తుకుపోతారట, మగవాళ్ళు. ఈ విధమైన వార్తలు నేడు మనం పత్రికలలో తరచు చూస్తూనేవుంటాం. దానికి రాచకీయకారణా లేమీ లేవు. ఇది దుండగీడుతనం కాదు. దానికి జవాబుదారీ ప్రకృతి.

* * *

పోతే బొంబాయి, బెంగాలు రాష్ట్రాలూ, ఆంధ్రదేశం విషయం తీసుకుంటే ఇక్కడ ఆడవాళ్ళు మొగవాళ్ళుకూడా సమానసంఖ్యలోనే ఉన్నట్టు కనిపిస్తారు. కాని, ఎందుచేతనో కాని ఇక్కడ కొంతమంది విద్యావతులైన యువతులు ఇంగ్లండు, అమెరికా, మళయాళ దేశాలలో స్త్రీలకు మల్లేనూ, కొంతమంది విద్యావంతులైన యువకులు సరిహద్దు రాష్ట్ర ప్రజలకు మల్లేనూ, ఉండటానికి ఆతృత పడుతూంటారు. దీనికి కూడా జబాబుదారీ ప్రకృతేఅనడానికి నామనస్సు అంగీకరించడంలేదు.